క్లుప్తంగా

మహిళా హోంమంత్రి ఉన్నా అత్యాచారాలపై చర్యలేవీ?



మాట్లాడుతున్న మహిళా సమాఖ్య నేతలు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో ఓ మహిళ హోం మంత్రిగా ఉన్నా, అత్యాచారాలు మాత్రం ఆగడం లేదని ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి భారతి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సీఆర్ భవన్‌లో జరిగిన ఏపీ మహిళా సమాఖ్య నగర కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తిరుపతిలో మూడు సంవత్సరాల పసికందుపై కామాంధుడు అత్యాచారం చేసిన ఘటన కలచి వేసిందన్నారు. అయినా పోలీసులు సరైన రీతిలో విచారణ చేయడం లేదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో శైలజ, వెంకటేశ్వరమ్మ, మునెమ్మ, ఆశావేగం పాల్గొన్నారు.

13న ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో బహిరంగ వేలం

కర్నూలు (టౌన్): కర్నూలులోని ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపోలో ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వి.శ్రీధర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్‌బీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు కర్నూలు డిపోలో ఉన్న 93 ఫ్రీజర్స్, 96 బ్యాటరీ ఇన్వర్టర్స్, 96 క్యాష్ చెస్ట్, 192 స్కానర్లు, 96 క్యాష్ కౌంటింగ్ మిషన్లను బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల పాటాదారులు రూ.5 వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. డిపాజిట్ చెల్లించినవారికి వేలం రోజున ఉదయం 9 గంటలకు ఎంట్రీ పాసులు ఇస్తారని, పాసులు లేనివారికి లోపలికి అనుమతి ఉండదని తెలిపారు. ఇతర వివరాలకు డిపో మేనేజర్ 99493 51039 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

13 నుంచి క్రీడాపోటీలు

కర్నూలు (టౌన్): చిల్డ్రన్స్ డే పురస్కరించుకొని ఈ నెల 13, 14 తేదీల్లో నగర శివారులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మైదానంలో అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న అండర్-12, అండర్-15 విభాగంలో చెస్ పోటీలు, అలాగే బాలుర విభాగంలో ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 14న బాలుర త్రోబాల్, బాలికల వాలీబాల్, బాల బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు, అలాగే రైఫిల్ షూటింగ్ పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు రాజ్‌విహార్ నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని, పూర్తి వివరాలకు 93938 27585 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కర్నూలు (టౌన్): గౌండా పనిచేసే ఎర్రిస్వామి (30) కోడుమూరు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సోమవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. కోడుమూరు రోడ్డులో గౌండా పనికి వెళ్లిన ఎర్రిస్వామి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా అదుపు తప్పి కింద పడ్డాడు. స్థానికులు వెంటనే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు.

కుమారుడి మృతిపై విచారణకు డిమాండ్

కర్నూలు (టౌన్): తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని, విచారణ జరిపి న్యాయం చేయాలని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. నిర్మల్ నగర్‌కు చెందిన హరిబాబు టీజీవీ యాజమాన్య కంపెనీ ఎస్ఆర్‌హెచ్‌హెచ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ రాత్రి కోడలు తమ్ముడైన విష్ణువర్ధన్ ఫోన్ చేసి హరిబాబు ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం ఇచ్చాడని తండ్రి వెంకటేశ్వర్లు సోమవారం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడి మృతిపై పోలీసులు విచారణ జరపాలని విన్నవించారు.

6 నుంచి క్రీడాపోటీలు

కర్నూలు (టౌన్): బాలల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక సీరాక్ పాఠశాల మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు వజీరా ఖాతూన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ రేస్, మ్యూజికల్ చైర్స్, బాల్ గేమ్స్ వంటి క్రీడలు ఉంటాయని వెల్లడించారు.

స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): కాకినాడలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే 36వ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించాలని ఏ.క్యాంపు మాంటిస్సోరి ప్రిన్సిపాల్ రమాజ్యోతి అన్నారు. రాష్ట్రపోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు మాన్విత్రీ, హితాత్రీ, శామ్యూల్ రెనాల్డ్‌లను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా స్కేటింగ్ సీఈఓ సునీల్‌కుమార్, పీఈటీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనధికారిక దుకాణాలను తొలగించండి

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలువురు వినతులు
- సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం : కమిషనర్



అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): స్థానిక గాయత్రి ఎస్టేట్‌లో రహదారులపై అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాల వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు గాయత్రీ టవర్స్ అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు నర్సయ్య, రాజు, దిలీప్ వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు పాల్గొనగా వివిధ కాలనీలకు చెందిన పలువురు వినతిపత్రాలు అందజేశారు. ప్రతి అర్జీదారుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్న రాముడు, ఎస్ఈ జి.రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- రహదారులు, మురుగు కాలువలు నిర్మించాలని చింతలముని నగర్‌కు చెందిన స్థానికులు ప్రకాష్, సుగుణమ్మ, రత్నమ్మ, మున్నా, స్వాములు విన్నవించారు.
- బొరుగుల లైన్‌లో మంచినీటి సమస్య పరిష్కరించాలని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన ఉషారాణి అభ్యర్థించారు.
- రహదారులకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించాలని, కాలనీలో రహదారులు నిర్మించాలని మహాలక్ష్మి నగర్, కమలా నగర్-2 కాలనీ వాసులు రాజశేఖర్, తాజుద్దీన్, సుధ, హరి కోరారు.
- సిద్ధి వినాయక కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పెద్దపాడుకు చెందిన స్థానిక కాలనీవాసులు చరణ్, రఘు విన్నవించారు.

టిడ్కో గృహాల్లో వసతుల కల్పనకు చర్యలు

కర్నూలు (టౌన్): జగన్నాథగట్టు వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయంలో అవసరమైన వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. సోమవారం అధికారులతో కలసి కమిషనర్ టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. టిడ్కో గృహాల్లో 255 బ్లాకుల్లో 10 వేల గృహాలు ఉన్నాయన్నారు. అందులో నివాసముంటున్న లబ్దిదారులు, ఖాళీగా ఉన్న గృహాలకు సంబంధించిన వివరాలతో పాటు విద్యుత్, తాగునీటి కనెక్షన్ వివరాలపై సచివాలయ సిబ్బందితో సర్వే చేపట్టాలన్నారు. సర్వే ఆధారంగా గృహాల్లో మరమ్మతు పనులు చేపడతామని వెల్లడించారు. టిడ్కో డీఈ గుప్త, టిడ్కో స్పెషలిస్ట్ అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో దళారులను నియంత్రించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో దళారులను నివారించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడును ఏపీ రైతు సంఘం నాయకులు కలిసి ఉల్లికి మద్దతు ధరను కల్పించాలని కోరారు. ఇక్కడి వ్యాపారులు, ట్రేడర్లు ఏకమై రైతులను ముంచుతున్నారని ఆరోపించారు. అలాగే మార్కెట్ యార్డులో కనీస వసతులను కల్పించాలని, తాగునీటిని ఏర్పాటు చేయాలని, భోజన వసతి కల్పించాలని కోరారు. మరోవైపు హంద్రీ నీవా కాలువ సామర్థ్యాన్ని పెంచాలని సీపీఎం రాష్ట్ర నాయకులు కె.ప్రభాకరరెడ్డి, రాంభూపాల్, డి.గౌస్‌దేశాయ్ మంత్రికి విన్నవించారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.


పేదలకు ఇళ్లు ఇవ్వాలి

కర్నూలు జిల్లాలో నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లాకు వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం సమర్పించారు.

శివాలయాల్లో కార్తీక పూజలు



సాయీశ్వరాలయంలో స్వామి వారు



ప్రత్యేక అలంకరణలో గౌరీ శంకరుడు

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా శివాలయాల్లో విశేష పూజలు జరిగాయి. తెల్లవారుజామున, సాయంత్రం సంధ్యా సమయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక స్నానాలను ఆచరించి ఆలయాలను సందర్శించి దీపాలను వెలిగించి, ఆకాశ దీప దర్శనం చేసుకున్నారు. కార్తీక వన భోజన కార్యక్రమాలు జరిగాయి. నగరంలోని సప్తగిరి కైలాసగిరి ఆలయం, దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, నెహ్రూనగర్ సాయీశ్వరాలయం, అశోక్‌నగర్, శ్రీరామ్‌నగర్ శివాలయాలు, బుధవార పేట ఈశ్వరాంజనేయ స్వామి ఆలయం, వైద్య కళాశాల మైదానం నీలకంఠ స్వామి ఆలయం, ఓల్డ్‌సిటీ నగరేశ్వర స్వామి ఆలయం, లలితా పీఠం, నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని మహాగౌరీ శంకర ఆలయం, జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



పోస్టర్లను విడుదల చేస్తున్న మేడ్ నేతలు

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో మోడల్ అసోసియేషన్ ఫర్ దళిత్ ఎంప్లాయిస్ (మేడ్) ముందు వరుసలో ఉందని రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిదాసు ఈరన్న అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మేడ్ 7వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మేడ్ జిల్లా అధ్యక్షురాలు బెన్నమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈరన్న మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని దళిత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో మేడ్ నిరంతరం శ్రమిస్తోందన్నారు. జిల్లా అధ్యక్షురాలు బెన్నమ్మ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదిన గుంటూరులోని ఏసీ కళాశాలలో జరగనున్న మేడ్ 7వ రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో దళిత ఉద్యోగులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. మేడ్ రాష్ట్ర కన్వీనర్ డీ రాజ్యలక్ష్మి, జీ.సుమనరాణి, కే.వేణుగోపాల్ పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాలను నిలిపివేయాలి



రాస్తారోకో చేస్తున్న రైతు సంఘం నాయకులు

కోడుమూరు రూరల్: కప్పట్రాళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన యురేనియం తవ్వకాలను వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం కోడుమూరులో రైతు సంఘం నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కోసం పచ్చని పంట పొలాలను నాశనం చేయడానికి యత్నిస్తోందని, ఇందుకు నిదర్శనం కప్పట్రాళ్ల యురేనియం తవ్వకాలేనని విమర్శించారు. హంద్రీనీవా కాలువ నీటితో కరువు నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న పల్లెల్లో యురేనియం పేరుతో తవ్వకాలు చేస్తామని కేంద్రం తెలుపడం దారుణమన్నారు. యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజలంతా కలిసికట్టుగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. తవ్వకాలను ఆపేంత వరకూ ప్రజలతో కలిసి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మనోహర్, నాయకులు ఆంజనేయులు, మల్లయ్య, హనుమంతు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో సౌకర్యాలు కరువు



ముళ్లపొదలతో నిండిన దిగువపాడు ఎస్సీ కాలనీ శ్మశానవాటిక

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని దిగువపాడు గ్రామంలో ఉన్న ఎస్సీ మాదిగ శ్మశాన వాటికలో సౌకర్యాలు కరువయ్యాయి. శ్మశాన వాటిక ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలతో నిండి పోయింది. గ్రామంలో ఉన్న దాదాపు 60 కుటుంబాల వారు ఈ శ్మశానంలో మృతదేహాలను ఖననం చేస్తారు. శ్మశానానికి మృతదేహాన్ని అంత్యక్రియలకు కొరకు తీసుకువచ్చినప్పుడు ముళ్ల పొదలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించాలని, ముళ్ల పొదలనూ తొలగించాలని, అంత్యక్రియలలో పాల్గొనడానికి వచ్చిన వారికి నీటి అవసరాల కొరకు కుళాయి లేదా బోరింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



దిగువపాడు గ్రామంలోని ఎస్సీ మాదిగ శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలి. ముళ్లపొదలు తొలగించి, చుట్టూ ప్రహరీ నిర్మించాలి. అలాగే నీటి వసతి ఏర్పాటు చేయాలి. గతంలో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. – రెడ్డిపోగు విజయ్ కుమార్, దిగువపాడు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆర్‌యూ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయకుమార్ నాయుడుకు వినతి పత్రం సమర్పించి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వర్సిటీలో పీజీ చదివే విద్యార్థులకు కోర్సు పూర్తవుతున్నా ఐడీ కార్డులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. పలు డిపార్ట్‌మెంట్లలో నీటి సమస్య ఉందని పరిష్కరించాలని కోరారు. వర్సిటీలోని సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఎస్ఎఫ్ఐ కో-కన్వీనర్ మౌలాలి, నాయకులు రాజు, సాగర్, నాగరాజు, రాజేష్ తదితరులు ఉన్నారు.

నాయకత్వ లక్షణాలపై శిక్షణ

కర్నూలు సిటీ: కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. నగర శివారులోని ఓ బీఈడీ కాలేజీలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ అమ్మి నాయుడు ప్రారంభించి ప్రసంగించారు. మండలంలోని స్కూళ్లకు సంబంధించిన అంశాలన్నింటిపై ఎంఈఓలకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాల అభివృద్ధికి స్కూల్ హెచ్ఎంలు పాటుపడాలని, ఆయా స్కూళ్లలో ఉన్న టీచర్లతో పాటు, స్థానికులతో కలిసి స్కూల్ అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతూ అందరి సహకారంతో సర్వతోముఖాభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంఓ రఫీక్, ఎంఈఓలు, హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

టైర్ల దుకాణంలో చోరీ

కర్నూలు (టౌన్): నగరంలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ ప్రక్కన బీఎస్‌టీఆర్ టైర్ల దుకాణంలో చోరీ జరిగింది. ఆదివారం సెలవు కావడంతో షాపు మూసి ఉంది. దొంగలు షాపు వెనుకవైపు నుంచి దుకాణం పైకి ఎక్కి సీసీ కెమెరాల వైర్లను కట్ చేశారు. ప్రహరీ గోడ ద్వారా లోపలికి వెళ్లి గేట్ల తాళాలు పగులగొట్టారు. లోపల ఉన్న క్యాష్ కౌంటర్ తెరిచే ప్రయత్నం చేసినా రాలేదు. దీంతో 3 ఇన్వర్టర్ బ్యాటరీలు ఎత్తుకుని ఉడాయించారు. ఉదయం షాపు తెరిచేందుకు వెళ్లిన యజమాని రవికిషోర్ చోరీ జరిగినట్లు గుర్తించి నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పడకేసిన పారిశుద్ధ్యం



పూడిపోయిన మురుగు కాలువ

కల్లూరు : మండల పరిధిలోని తడకనపల్లె గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామంలో వీధులలో ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం పేరుకుపోయింది. డ్రైనేజీ కాలువలు సరిగా లేకపోవడంతో మురుగు నీరు, మట్టితో నిండాయి. వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్యం లోపించడం వల్ల దోమలు, ఈగలు, లార్వాలు వృద్ధి చెందే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్యం పనులు నిర్వహించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఎస్వీని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎస్వీ మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డిని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ కలిశారు. సోమవారం సాయంత్రం ఎస్వీ స్వగృహంలో ఆయన్ను కలిసి శాలువ కప్పి సన్మానించారు. జిల్లాలో ఎస్సీ సెల్ కార్యవర్గం, పార్టీ విషయాలపై చర్చించారు. ఎస్సీ సెల్ నాయకులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు

కర్నూలు (టౌన్): నగరంలోని వన్‌టౌన్ ఏరియాలో ఉన్న మాసుం బాషా దర్గా ఉరుసులో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ అధ్యక్షురాలు ఎస్వీ విజయమనోహరి పాల్గొన్నారు. వీరికి దర్గా పీఠాధిపతులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్వీ దంపతులు చాదర్ సమర్పించారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్తీక శోభితం.. బుగ్గరామేశ్వరం





కాల్వబుగ్గలో స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం, జ్యోతులను వెలిగిస్తున్న మహిళలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వర క్షేత్రం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీక మొదటి సోమవారం కావడంతో ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కళ్లె లక్ష్మీనారాయణ శర్మ, నరసింహశర్మ బుగ్గరామేశ్వర స్వామి, భ్రమరాంబికాదేవికి సుప్రభాత సేవ, అభిషేకాది పూజలు నిర్వహించారు. అనంతరం రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలతో ప్రత్యేకం అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తిని పల్లకీలో ఆశీనులను గావించి గర్భగుడి చుట్టూ ప్రదక్షిణలతో పల్లకీ సేవ చేపట్టారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తల్లితండ్రులు సుబ్రహ్మణ్యం, సుగుణమ్మ, గ్రీన్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, స్థానిక తహసీల్దార్ విద్యాసాగర్ ఆలయానికి చేరుకొని స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఈఓ మద్దిలేటి ఆలయ మర్యాదలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు మొత్తం 27 అభిషేకాలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నట్లు ఈఓ తెలిపారు. అలాగే హుసేనాపురం గ్రామానికి చెందిన భక్తుడు కాటినేని నారాయణ పుణ్య దంపతుల ఆర్థిక సౌజన్యంతో దేవస్థానంలో పుష్పాలంకరణ చేయించారు. కార్తీక మాసంలో శివపార్వతులను దర్శించుకోవడంతో సకల పాపాలు తొలగతాయనే విశ్వాసంతో మహిళలు ఉదయాన్నే కాల్వబుగ్గ క్షేత్రానికి అధిక సంఖ్యలో చేరుకొని స్థానిక పుష్కరిణుల్లో పవిత్రస్నానమాచరించి, ఆలయం ఎదుట గల ధ్వజస్తంభం వద్ద ప్రమిదలలో జ్యోతులను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.


కల్తీ ఆహారంపై చర్యలు తీసుకోండి




అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు పట్టణంతో పాటు శివారులోని హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ ఆహారంపై దాడులు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నాయకులు సోమవారం అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మానంద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న, శివ మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లలో రంగురంగుల ప్రకటనలతో ప్రజలను ఆకర్షించడమే గాకుండా రుచికరంగా ఉండేందుకు, మంచి రంగు కనిపించేందుకు అధిక మోతాదులో కెమికల్స్ వాడుతూ, వాడిన వంట నూనెను పదేపదే వినియోగిస్తూ ప్రజలకు క్యాన్సర్, అల్సర్ వంటి వ్యాధులను అంటగడుతున్నారని విమర్శించారు. వంటశాలల్లో శుభ్రత పాటించడం లేదని, కుళ్లిన కూరగాయలు వాడుతున్నారని, చికెన్, మటన్‌లను డీప్ ఫ్రిజ్‌లో నిల్వ చేసి వారాల కొద్దీ వాడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి వారిపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.

టెట్ ఫలితాల్లో సత్తా



ఎం.సువర్ణ



ఎస్.సబ అంజుమ్



లక్ష్మేశ్వరి



ఎం.సోమశేఖర్

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. కర్నూలు ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు డైరెక్టర్ అరుణాచలం రెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన ఎం.సువర్ణ 146.89/150, ఎస్.సబఅంజుమ్ 142.26, లక్ష్మేశ్వరి 142.3, ఎం.సోమశేఖర్ 141.53 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు పలువురు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు.

ఎంతో 'ఓపి'క ఉండాల్సిందే !



ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం వేచి ఉన్న రోగులు



రక్తపరీక్షల కోసం గుమిగూడిన రోగులు

కర్నూలు పెద్దాసుపత్రిని నమ్ముకుని ఎంతో దూరం నుంచి ప్రజలు వ్యయప్రయాసలకు ఓర్చి చికిత్స కోసం వస్తుంటారు. అయితే ఇక్కడ ఓపీ తీసుకునేందుకు కనీసం అరగంట నుంచి గంటసేపు క్యూలో వేచి ఉండాలి. ఆ తర్వాత డాక్టర్ వద్దకు వెళ్లేందుకు మరో అరగంట, అనంతరం వైద్య పరీక్షలకు రక్తం శ్యాంపిల్ ఇచ్చేందుకు, ఎక్స్‌రే తీయించుకునేందుకు క్యూలో ఇంకో అరగంట, ఆ రిపోర్ట్ తీసుకునేందుకు మరికొన్ని గంటలు వేచి ఉండాలి. ఇలా గంటల కొద్దీ వేచి చూడాలంటే ఎంతో ఓపిక ఉండాలి. ముఖ్యంగా దయాగ్నోస్టిక్ బ్లాక్‌లో రక్తపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే తీయించుకునేందుకు ఎక్కువసేపు నిలబడాల్సి వస్తోంది. అధికారులు తగిన చర్యలు తీసుకొని సత్వర వైద్యసేవలు అందించాలని రోగులు కోరుతున్నారు. – కర్నూలు(హాస్పిటల్)